క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు శ్రీహరినగర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి నూతన వస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. శ్రీహరినగర్, కైలాసనగర్, బాలాజీనగర్, డ్రైవర్స్ కాలనీ, అప్సరా కాలనీ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. జీవీఎంసీ మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ వేణుగోపాల స్వామిని దర్శించున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులకు హరివెంకటకుమారి అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ–అనకాపల్లి జిల్లాల్లోని 11 డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉభయ జిల్లాల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 బాలుర, 7 బాలికల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలబాలికలు ఆయా పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్‌ను జత చేసి ఈ నెల 24వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. 25న బుధవారం ఉదయం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 0891–2799641లో సంప్రదించాలని సమన్వయకర్త కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర‘మూడో’ శనివారం కార్యక్రమం జరిగింది. సీఈవో పి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛత ఆవశ్యకత, పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీఆర్ఎంఈఏ అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఏపీఎన్‌జీవో జాయింట్ సెక్రటరీ ఎ.మదన్‌మోహన్, పరిపాలనాధికారులు మంజులవాణి, ఎం.నరసింహమూర్తి, పి.వి.వి.ఎస్.మూర్తి, రాజేశ్వరి, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, పంచాయితీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యోగాంధ్ర కార్యక్రమం ఉన్నప్పటికీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నానికి విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉంది. పాలిటెక్నిక్ కళాశాలలో 7,501 నుంచి 15,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 296 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. భాషా, లెక్చరర్ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం 23,501 నుంచి 32,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్ కేవీ రమణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. 1 నుంచి 7,500 ర్యాంక్ వరకు గల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రిన్సిపాల్ అందించారు. ఆదివారం 15,001 నుంచి 23,500 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

యోగాంధ్రలో గందరగోళం



- బీచ్ రోడ్డులో యోగా సాధకుల పాట్లు
- గ్యాలరీలతో సంబంధం లేకుండా దొరికిన చోట కూర్చున్న జనం
- టీ షర్ట్‌లు, మ్యాట్‌లు, టిఫిన్ పొట్లాల కోసం తోపులాటలు, గొడవలు
- వాటిని పంపిణీ చేయలేక చేతులెత్తేసిన సిబ్బంది
- బస్సులు అందుబాటులో లేక కాలినడకన ఇళ్లకు చేరిన జనం



పీఎం మోదీ ప్రసంగిస్తుండగా డివైడర్ ఫుట్‌పాత్‌పైన కూర్చున్న వృద్ధులు, మహిళలు



గ్యాలరీలో స్థలం లేక మ్యాట్‌లు పట్టుకుని బయట నిరీక్షిస్తున్న జనం

ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శనివారం చేపట్టిన జాతీయ కార్యక్రమంలో భాగంగా విశాఖ బీచ్ రోడ్డులో యోగాంధ్ర నిర్వహించాయి. ఇందులో భాగంగా బీచ్ రోడ్డులోని తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం నుంచి సీతకొండ మలుపు వరకు కొన్ని గ్యాలరీలు ఏర్పాటు చేశాయి. ప్రతి దానిలో 650 మంది వరకు యోగాభ్యాసకులకు కేటాయించారు. దీనికోసం ఆరిలోవ, ఆదర్శనగర్, తోటగరువు, విశాలాక్షినగర్ ప్రాంతాల నుంచి వేల మంది ప్రజలను బస్‌ల్లో తరలించారు. అంతవరకు పలు విభాగాల అధికారులు, సచివాలయాల సిబ్బంది విజయవంతమయ్యారు. యోగా సాధన కోసం బీచ్ రోడ్డుకు చేరుకున్న జనాన్ని మాత్రం క్రమపద్ధతిలో నిలువరించలేకపోయారు. దీంతో సాగర తీరాన ప్రశాంతమైన వాతావరణంలో గందరగోళం నడుమ యోగాంధ్ర కార్యక్రమం సాగింది. టీషర్ట్‌లు, యోగా మ్యాట్‌లు, టిఫిన్ పొట్లాలను సక్రమంగా పంపిణీ చేయలేక సిబ్బంది చేతులెత్తేశారు. వాటి కోసం జనం ఒకర్నొకరు తోసుకుంటూ.. కేకలు వేస్తూ గొడవలకు దిగారు. దీంతో బలవంతులు దొరికిన కాడికి యోగా మ్యాట్‌లు, టీ షర్టులు, టిఫన్ పొట్లాలు పట్టుకుపోయారు. ఇలా 4, 5 చొప్పున కొందరు పట్టుకుపోగా.. మరికొందరికీ ఒక్కటీ దొరకలేదు. దీంతో ఈసురోమంటూ వెనుదిరిగారు. వేకువజామున ఇళ్ల నుంచి బీచ్ రోడ్డు వరకు తీసుకెళ్లిన బస్‌లు యోగా సమయం మధ్యలో అందుబాటులో లేకపోవడంతో కాళ్లకు పనిచెప్పి కిలోమీటర్ల కొలదీ నడిచి ఇంటికి చేరుకోవాల్సి వచ్చింది.



యోగా జరుగుతుండగా చోటు లేక వెనుదిరుగుతున్న జనం. మరోపక్క ప్రజలను తీసుకొస్తున్న బస్సులు

గ్యాలరీల్లో స్థలం దొరక్క ఇబ్బందులు

తెన్నేటి పార్కు నుంచి సీతకొండ, విశాఖ వ్యాలీ స్కూల్, జూ పార్కు సాగర్ గేటు వరకు సీ–25 నుంచి 40 వరకు, ఏ–17 గ్యాలరీలు సిద్ధం చేశారు. వాటిలో 650 మంది చొప్పున విడిచిపెట్టారు. ఉదయం 5 గంటల నుంచి అక్కడికి జనం చేరుకున్నారు. వారిలో ముందుగా చేరుకున్న వారు గ్యాలరీతో సంబంధం లేకపోయినా దొరికిన చోట కూర్చుండిపోయారు. సిబ్బంది కూడా వారిని నిలువరించలేదు. దీంతో వెనుక వచ్చిన వారికి యోగా చేయడానికి గ్యాలరీల్లో చోటులేక కొందరు రోడ్డు మధ్యలో డివైడర్‌పైన, మరికొందరు ఫుట్‌పాత్‌లపైనా కొంతసేపు నిరీక్షించారు. ఎక్కువ సమయం అలా బయట కూర్చోలేక ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం జరుగుతుండగానే ఇంటిముఖం పట్టారు. ఇదిలా ఉండగా ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల నుంచి ప్రజలను తీసుకొచ్చిన బస్‌లు యోగా సమయం ముగిసేంత వరకు సీతకొండ ప్రాంతం బీచ్ రోడ్డుకు చేరుకోవడం విశేషం.



యోగా సాధనకు ఏ గ్యాలరీకి వెళ్లాలో తెలియక గుమిగూడిన జనం



సీతకొండ వద్ద బీచ్ రోడ్డులో యోగా చేస్తున్న అభ్యాసకులు

దెబ్బగొట్టిన ఎమ్మెల్యే నగదు రివార్డు

తూర్పు నియోజకవర్గ ప్రజల కోసం ఏర్పాటు **చేసిన గ్యాలరీలను జనంతో తొందరగా** నింపిన **వారికి నగదు బహుమతి ఇస్తామని** ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రకటించారు. తన నియోజకవర్గ ప్రజలతో యోగాంధ్ర కార్యక్రమంలో తొందరగా పాల్గొన్నామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ వద్ద మార్కులు కొట్టేయాలని తపనపడ్డారు. ఇందులో భాగంగా తొందరగా ప్రజలను తీసుకొచ్చి వారికి కేటాయించిన గ్యాలరీని మొట్టమొదటిగా నింపిన నియోజకవర్గంలో వార్డు టీడీపీ నాయకులకు, సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా గ్రూపుల లీడర్లకు రూ.3 లక్షలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నింపిన వారికి రూ.1 లక్ష చొప్పున బహుమతి ఇస్తామనని ముందుగానే ప్రకటించారు. అది ఇక్కడ మొదలకే మోసం తెచ్చిపెట్టినట్లయింది. తమ గ్యాలరీ మొదటిగా నింపేసి ఎమ్మెల్యే వద్ద నుంచి రూ.3 లక్షలు బహుమతి కొట్టేయాలని ఆలోచనతో నాయకులు, సిబ్బంది పోటీపడ్డారు. గ్యాలరీకి సంబంధం లేని వారిని కూడా లోపలకు తీసుకెళ్లి కూర్చోబెట్టేసి నింపేశారు. ఇక్కడ సంబంధం లేని 8, 9, 20, 22 తదితర గ్యాలరీలకు చెందిన వారిని సైతం కూర్చోబెట్టేశారు. అనంతరం వెళ్లిన వారికి ఆ గ్యాలరీల్లో యోగా కోసం స్థలం లేకుండా పోయింది. వారిని లేవమంటే గొడవలు దిగేవారు. దీంతో ఏ–17, సీ– 30, 31, 32 గ్యాలరీలకు చెందిన వారు ఎక్కువమంది వెనుదిరిగారు. ఎమ్మెల్యే ప్రకటన తమకు చోటులేకుండా చేసిందంటూ జనం నిరాశ చెందారు.



యోగా మ్యాట్‌ల కోసం ఒకరిపై మరొకరు పడుతూ తోసుకుంటున్న జనం



22వ కంపార్ట్‌మెంట్‌లో యోగా మ్యాట్‌ల కోసం తోపులాట

కంపార్ట్‌మెంట్లలో తోపులాటలు

ఎంవీపీకాలనీ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ నుంచి అప్పుఘర్ వరకు ఏర్పాటు చేసిన పలు కంపార్ట్‌మెంట్లలో గందరగోళ పరిస్థితి నెలకొంది. యోగా మ్యాట్‌లు, టీ షర్ట్‌ల కోసం 20, 21, 22 కంపార్ట్‌మెంట్లలో తోపులాటలు జరిగాయి. సకాలంలో వచ్చినప్పటికీ టీ షర్ట్‌లు, మ్యాట్‌లు ఇవ్వలేదంటూ ఆయా కంపార్ట్‌మెంట్ల వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు, డ్వాక్రా మహిళలు గొడవకు దిగారు. దీంతో చాలా సేపటి తరువాత టీ షర్ట్‌లు, మ్యాట్‌లు పంచడంతో ఒక్కసారిగా తోపులాటలు చోటు చేసుకున్నాయి. 22వ కంపార్ట్‌మెంట్‌లో మ్యాట్‌ల కోసం, 21వ కంపార్ట్‌మెంట్‌లో టీ షర్ట్‌ల కోసం తోపులాట జరిగింది. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాలు జరుగుతున్న సమయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వందల మంది డ్వాక్రా మహిళలు కార్యక్రమం ప్రారంభమైన తరువాత కూడా ఆయా కంపార్ట్‌మెంట్‌ల వద్దకు చేరుకున్నారు. వారిని లోపలికి అనుమతించక పోవడంతోపాటు టీ షర్ట్, మ్యాట్ వంటివి ఏవీ ఇవ్వకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పుఘర్ కూడలిలోని 22వ కంపార్ట్‌మెంట్‌లో టీ షర్ట్, మ్యాట్ వంటివి ఏవీ లేకుండానే మహిళలు రోడ్డుపైనే కూర్చుండిపోయారు.

మ్యాట్‌లు, టీ షర్ట్‌లు ఇవ్వలేదు



మ్యాట్‌లు, టీ షర్ట్‌లు ఒకరికిచ్చి మరొకరికి ఇవ్వలేదు. ఎవరు ఎవరికి ఇస్తున్నారో తెలియలేదు. మేము ఆరిలోవ నుంచి బస్‌లో వచ్చాం. ఎనిమిది మందిమి ఓ చోట కూర్చొన్నాం. నాకు ఒక్కదానికే మ్యాట్ ఇచ్చారు. మిగిలిన వారికి ఎంత ప్రయత్నించినా ఇవ్వలేదు. టీ షర్ట్‌లు కూడా లేవు. అందుకే ఉండకుండా తిరిగి వెళ్లిపోయాం.

– ఎస్.గయూషా, ఆరిలోవ

దొరికిన వారికి దొరికినన్ని..



బీచ్ రోడ్డులో అంతా తోపులాట జరిగింది. మ్యాట్‌లు, టిఫిన్ పొట్లాలు, టీ షర్ట్‌ల కోసం జనమంతా ఒకరిమీద మరొకరు పడిపోయారు. దొరికిన వారు దొరికినన్ని పట్టుకుపోయారు. మిగిలిన వారికి ఒక్కటీ లేకుండా పోయింది. ఇక్కడ నిర్వాహకులు పట్టించుకోలేదు. యోగాంధ్ర కార్యక్రమంతా గందరగోళంగా మారింది.

– నాని, ఆరిలోవ

సౌకర్యాల కల్పన అధ్వానం



తెల్లవారు 3 గంటలకు బస్సులు ఎక్కించి అప్పుఘర్‌కు తీసుకొచ్చారు. అష్టకష్టాలు పడి ఇక్కడికి చేరుకున్నాక.. కంపార్ట్‌మెంట్‌ల ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. మ్యాట్, టీ షర్ట్ ఇలా అన్ని అయిపోయాయని చెప్పారు. దీంతో యోగాసనాల్లో భాగస్వామి కాలేకపోయాను. వసతులు లేనప్పుడు ఎందుకు తీసుకొచ్చారో అర్థం కాని పరిస్థితి. కొన్ని రోజులుగా యోగాసనాలు సాధన చేయడం, రిజిస్ట్రేషన్ అన్ని వృథా అయ్యాయి.

– ధనలక్ష్మి, ఫిషింగ్ హార్బర్

ఉత్సాహంగా వచ్చి నిరాశతో వెనుదిరిగాం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చాలా మంది మహిళలు ఉత్సాహంగా వచ్చి నిరాశతో వెనుదిరిగారు. సరైన కమ్యూనికేషన్ లేకపోవడమే దీనికి కారణం. వార్డుల్లో బస్సులు ఎక్కించి అప్పుఘర్ దగ్గరలోని కంపార్ట్‌మెంట్‌లకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 5 గంటలకే కంపార్ట్‌మెంట్‌ల వద్ద క్యూఆర్ కోడ్‌లు, ఇతర సౌకర్యాల కల్పన నిలిపేశారు. దీంతో వందల మంది నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

– సత్య, టౌన్ కొత్తరోడ్డు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పార్టీ 28వ వార్డు శ్రేణులు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో మంత్రి లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు అధ్యక్షతన శనివారం రామ్‌నగర్ వేమన మందిరంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి హామీని నెరవేర్చామని, అందువల్లే నేడు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా.. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో చట్టవ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పాలన సాగిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులందరూ ఏకాభిప్రాయంతో వార్డు, బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కమిటీ పదవుల్లో 28వ వార్డులోని అన్ని బూత్‌ల సభ్యులు ఉండేలా చూసుకోవాలని, భవిష్యత్తులో అందరి కష్టానికి తగిన ప్రతిఫలం ఉండేలా తాను బాధ్యత తీసుకుంటానని మొల్లి అప్పారావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, రాపాక శ్రీను, తెలుగు చంద్రరావు, బోండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు పోలీస్ ట్రీట్‌మెంట్

- యోగాంధ్రలో ఖాకీల అత్యుత్సాహం
- సాధారణ ప్రజలను ఇబ్బంది పెట్టిన వైనం



పాండురంగాపురం వాసులను అడ్డుకున్న పోలీసులు



పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చెన్నైకి చెందిన పర్యాటకులు

బీచ్ రోడ్డు: యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోదీ కాన్వాయ్ రాక నేపథ్యంలో పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. ఉదయం 5 గంటల నుంచే పాండురంగాపురం జంక్షన్ వద్ద పాదచారులను, వాహనాలను 80 నిమిషాల పాటు నిలిపివేయడంతో స్థానికులు, సందర్శకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, ఉదయం నడకకు వెళ్లేవారు, ఉద్యోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. రెండు రోజులు పాటు విశాఖలో సందర్శించేందుకు చెన్నై నుంచి వచ్చిన యువతీ యువకులకు పోలీసులు చుక్కలు చూపించారు.. వారు తిరిగి ప్రయాణం వెళ్లేందుకు రైల్వే స్టేషన్ కు బయలుదేరగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. తమకు 6:40 గంటలకు ట్రైన్ ఉందని రైల్వే స్టేషన్‌కు వెళ్లాలని పోలీసులను ప్రాధేయపడినా పట్టించుకోలేదు. ప్రధాని కాన్వాయ్ వెళ్లినంత వరకు అక్కడే నిలిపివేశారు. పోలీసుల తీరుపై పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ అంబులెన్స్‌ను నిలిపివేశారు.

ఉద్యోగం పోతే పోనీ..

జిమ్‌కు టైమవుతుందని, సమయానికి వెళ్లకపోతే చాలా మంది ప్రముఖులు ఇబ్బంది పడతారని ఓ ట్రైనర్ పోలీసులు వేడుకున్నా పట్టించుకోలేదు. జిమ్‌కు వెళ్లకపోతే నా ఉద్యోగం పోతుందని పోలీసులను ప్రాధాయపడ్డాడు.. అయినా సరే సదరు పోలీసులు ఉద్యోగం పోతే పోనీ వెళ్లడానికైతే వీలు లేదంటూ ఆయనను నిలిపివేశారు. అలాగే దస్పల్లా హిల్స్‌లోని ఓ ఇంట్లో పాము దూరిందని చెప్పినా, స్నేక్ స్నాచర్‌ను పోలీసులు అనుమతించలేదు. ఇలా పోలీసుల ఓవర్‌యాక్షన్‌తో సామాన్యులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.



అంబులెన్స్‌ను సైతం ఆపేసిన పోలీసులు



ప్రధాని కాన్వాయ్ అనంతరం.. ఒక్కసారిగా జంక్షన్ క్రాస్ చేస్తున్న సందర్శకులు

జూలో జిరాఫీలపై విద్యార్థులకు అవగాహన



జూ పార్కులో జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద జిరాఫీ మాస్కులు వేసుకున్న చిన్నారులతో జూ అధికారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో శనివారం అధికారులు ప్రపంచ జిరాఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు గ్రూప్‌లుగా పాల్గొని ప్రతిభ చూపారు. జిరాఫీపై కథలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం యానిమల్ కీపర్లతో మాట్లాడించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అధికారులు జిరాఫీ మాస్కులు పంపిణీ చేశారు. వారిని జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్దకు తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు వన్యప్రాణుల విద్య అవసరమన్నారు. వాటి గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జూలో ఉన్న జిరాఫీలు రెట్టిక్యులేటెడ్ ఉపజాతికి చెందినవన్నారు. వాటి గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూ అధికారులు, వెటర్నరీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలో గ్రూప్‌గా పాల్గొన్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం పదిలం



ఇగ్నో కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న డైరెక్టర్ ధర్మారావు, అధికారులు, విద్యార్థులు



యోగాసనంలో సత్యసాయి స్కూల్ విద్యార్థులు



ఎంవీపీ రైతుబజార్‌లో యోగసనాలు వేస్తున్న మహిళా రైతులు, సిబ్బంది



హెల్త్ ఎరీనాలో స్థానికుల యోగాసనాలు

ఎంవీపీకాలనీ: యోగా సాధనతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఇగ్నో డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన యోగాసనాలు వేశారు.

- ఎంవీపీ సెక్టార్–8లోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున యోగసనాలు వేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి, కన్వీనర్ ఎస్.జి.చలం తదితరులు పాల్గొన్నారు.
- ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో సిబ్బంది, మహిళా రైతులు యోగాసనాలు వేశారు. యోగా అభ్యాసకుడు రవి, లీగల్ సెల్ అథారిటీ న్యాయవాది శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- కైలాసగిరి దిగువనున్న హెల్త్ ఎరీనా పార్క్‌లో అధిక సంఖ్యలో స్థానికులు, యువత ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.

ఫౌంటెయిన్ కాదు.. మంచినీటి పైప్‌లైన్ లీకేజీ



మద్దిలపాలెం వద్ద ఫౌంటెయిన్‌ను తలపిస్తూ లీకవుతున్న మంచినీటి ప్రధాన పైప్‌లైన్

మద్దిలపాలెం: మద్దిలపాలెం వద్ద ఏయూ గేట్ పక్కన, సీఎంఆర్ సెంట్రల్ ఎదురుగా మంచినీటి ప్రధాన పైప్‌లైన్ లీకవుతోంది. పైపులో నుంచి లీకవుతూ ఎగసిపడుతున్న మంచినీరు వాటర్ ఫౌంటెయిన్‌ను తలపిస్తోంది. సుమారు గంట పాటు నీరు లీకై రోడ్డుపై వృథాగా పోతున్నా.. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేదని స్థానికులు తెలిపారు. అనంతరం సమాచారం తెలుసుకున్న జీవీఎంసీ సిబ్బంది అక్కడికి చేరుకుని పైప్‌లైన్ లీకేజీని సరిచేశారు.